

# అనగనగా... ఒక కథ

సెలవులకి ఫ్రెండ్ రాజుతోబాటు వాళ్ల పల్లెటూరికి వెళ్లాను. మామిడి తోటలూ, గోదావరి స్నానాలూ, తేగలూ, ముంజికాయలూ, పూతరేకులూ, తాంధ్రా పల్లెటూరి తిళ్లన్నీ తనివితీరా ఎంజాయ్ చేసాను.

ఊరంతా సైకిళ్ల మీద చాలాసార్లు ప్రదక్షిణ చేశాం-

పెద్దవూరూ కాదు, చిన్న పల్లే కాదు. పల్లెటూరు అంటే ఎలా వుంటుందో అలా పుస్తకాలో చదువుకున్నట్లే వుంది. అక్కడివాళ్లు భేషజమైన అలంకారాలూ బట్టలూ వేసుకుని కనపడరు గానీ పల్లెటూరు బైతులేం కాదు. పట్నం మనుషుల్లాగే కల్లా, కపటం, కల్చరూ(?) పోటీ అన్నీ వాళ్లలోనూ వుంటాయి- కొత్తవాళ్లని పలకరించటం, వాళ్ల గురించి వివరాలు సేకరించటంలో పట్నం వాళ్లలా తటస్తంగా ఉండరు. ఆరాలు తీసి ఒకళ్లకొకళ్లు చిలవలు పలవలూ కల్పించి చెప్పుకుంటారు- నేనున్న నాల్గురోజుల్లోనూ నేనెవరితో వచ్చానో, ఎవరింట్లో ఉన్నానో, ఏం చేస్తున్నానో చాలామందికి తెల్సిపోయింది.

## శ్రీ కృష్ణ సహన సదనం

మర్నాడు ప్రయాణం అనగా సాయంత్రం మళ్లీ గోదావరి స్నానానికి బైల్దేరాం. ఈసారి ఇంకో రోడ్డుమీంచి ఇంకో గట్టు దిగుదాం అన్నాడు రాజు. ఆ దారిలో ఓ అందమైన పెంకుటిల్లు కనపడింది. మా రాజు..“ఒరే మా వూళ్ళో చూడదగ్గ ప్రదేశాల్లో ఇదొకటిరా!” అంటూ ఆ ఇంటివైపు తీసుకెళ్లాడు. విశాలంగా ఉన్న అరుగుల్తో దిట్టంగా ఉన్న ఆ ఇంటిముందు ‘శ్రీకృష్ణ సహన సదనం’ అన్న బోర్డు ఆర్భాటం ఏం లేకుండా ముచ్చటగా వుంది.

కిర్రుమన్న చప్పుడు చేస్తున్న గేటు తెరుచుకుని లోపలికెళ్లాం.

‘బావుందీ కాలింగ్ బెల్’ అనుకున్నాను.

ఆ చప్పుడికి లోపల్నుంచి ఒకాయన వచ్చాడు. సాదాసీదా బట్టలు- 10, 15 రోజులుగా ఉంచిన గెడ్డం -50 ఏళ్లు ఉంటాయేమో..గెడ్డం, తల కూడా పోటీ పడి తెల్లబడుతున్నాయి.

“ఎవురూ..” అన్నాడు వచ్చినాయన. మనిషి చూడ్డానికి, మొరటుగా వున్నా మాట మృదువుగా వుంది.

“నేను రావుడూ కరణంగారి తమ్ముడు రాజుని..”

“వార్నీ నే గుర్తుపట్లేదు..చాలా మారిపోయావ్ ఎవరో పట్నం వాళ్లేమో అనుకున్నా..ఈ పంతులుగారెవరూ..”

“మా ఫ్రెండ్ రవి. నాతోపాటే మెడిసిన్ చేస్తున్నాడు- 5, 6 రోజులు సెలవుదొరికింది. మనూరు చూపిద్దామని, తీసుకువచ్చాను”

“ఓ చాలా సంతోషం- మీలాంటి డాక్టర్లకి పల్లెటూర్లు సూపించి ఇక్కడ గాలీ, నీరూ, చెట్టూ, సేమా ఎంత బావుంటాయో సెప్పి ఊరించాలి..అప్పుడు వాళ్లు పల్లెటూళ్లలో ప్రాక్టీసు పెట్టటానికి ముందుకు వస్తారు” నవ్వుతూ అన్నాడు రావుడు.

మేమూ ఓ వెర్రి నవ్వు నవ్వేశాం.

“ఎలా నడుస్తోంది సహనసదనం?”

“సాలా బావుంది బాబూ..ఈ ఏడాది ఇంకో 15 కుట్టుమిషన్లు కొన్నాం- 10 రిచ్చాలు తీసుకున్నాం..కృష్ణబాబూ, అయ్యగారూ...అమ్మగారు పైనుంచి సల్లగా చూసుకుంటున్నారు” ఆ మాటలంటూన్నప్పుడు రావుడు గొంతు వణికింది. కళ్లు తడయ్యాయి.

“మంచి చేద్దామనుకున్నప్పుడు మంచే జరుగుతుందిలే...వాళ్ల కోరికని నువ్వు సక్రమంగా చక్కగా నడిపిస్తున్నావ్”

“నాదేం లేదయ్యా” అంటూ అక్కడ ఉన్న మూడు శిలావిగ్రహాలకి దణ్ణం పెట్టాడు.

60, 70 ఏళ్ల ముసలి దంపతులు ఇద్దరికీ మధ్యలో పాతికేళ్ల యువకుడు ఉన్న శిలా విగ్రహాలవి-

కీ.శే.రాజయ్య, కీ.శే.శ్రీకృష్ణ, కీ.శే.సుందరమ్మ అని పేర్లున్నాయి. రాజు దణ్ణం పెంటాడు. నేనూ పెట్టాను. కాసేపు లోకం పోకడ-మంచి చెడ్డా మాట్లాడుకుని బైట పడ్డాం.

దార్లో వస్తుంటే చాలాసేపు మౌనంగా ఉన్నాడు రాజు.

“శ్రీకృష్ణ అని చాలా మంచి కుర్రాడుట! ఆ ముసలిదంపతులకి ఆ కుర్రాడంటే పంచప్రాణాలు. ఇప్పటికీ ఉంటే...40 ఏళ్లుండేవి కానీ 20 ఏళ్ల క్రితం హఠాత్తుగా తల్లిదండ్రులని వదిలిపెట్టి వెళ్లిపోయాడు” నెమ్మదిగా చెప్పాడు.

“ఈ ఊళ్లో అందరికీ ఆ అబ్బాయంటే ఇష్టమా?”

“అతనంటే ఇష్టం సరే అతని తల్లిదండ్రులంటే మా ఊరంతకీ గౌరవం”

* * *

శ్రీకృష్ణ ఏభయ్యవ పడిలో పడుతున్న తల్లిదండ్రులకి లేక లేక కలిగిన ఏకైక సంతానం.

అల్లారుముద్దుగా పెంచటం వల్ల పిల్లలు మొండివాళ్లుగానో, జులాయిలుగానో మారిపోతారంటారు గానీ...

అది తప్పనే మాటకి ప్రతిరూపం శ్రీకృష్ణ-

వినయం..వివేకం..సంస్కారం శ్రీకృష్ణకి జన్మతః పుట్టి పెరిగాయి.

డిగ్రీ మూడో సంవత్సరంలో వుండగానే రైల్వే పరీక్ష రాసి సెలక్టయ్యాడు. టిక్కెట్టు కలెక్టరు ఉద్యోగం. ఆర్నెల్లలో పర్మినెంట్ పోస్టు కూడా అయింది.

శ్రీకృష్ణకి పెళ్లి చేసి అతని పంచన ప్రశాంతంగా శేష జీవితాన్ని వెళ్లదీయాలని కొండంత ఆశతో పెళ్లి సంబంధాలు చూస్తున్నారు తల్లీ తండ్రీ.

కానీ..విధి వక్రించింది.

కాదు..మానవ సంఘమే వికటించింది.

ఒక విప్లవ సంఘం సమ్మెలోనో, ఒక మత విద్వేషాల యుద్ధంలోనో మరో ఆకలి పీడితుల పోరాటంలోనో శ్రీకృష్ణ ఉద్యోగ ధర్మం నెరవేరుస్తున్న ‘బోగీ’ అగ్నికి ఆహుతైపో

ఆ దారిలో ఓ అందమైన పెంకుటిల్లు కనపడింది. మా రాజు..“ఒరే మా వూళ్ళో చూడదగ్గ ప్రదేశాల్లో ఇదొకటిరా!” అంటూ ఆ ఇంటివైపు తీసుకెళ్లాడు. విశాలంగా ఉన్న అరుగుల్తో దిట్టంగా ఉన్న ఆ ఇంటిముందు ‘శ్రీకృష్ణ సహన సదనం’ అన్న బోర్డు ఆర్భాటం ఏం లేకుండా ముచ్చటగా వుంది.



యింది. నాలుగు డబ్బాల పెట్రోలూ, ఒక్క అగ్గిపుల్లతో ఎక్కడెక్కడో వున్న 50 కుటుంబాల్లో ఆరని మంటలెట్టేసింది.

రాజయ్య సుందరమ్మల గుండెల్లో కూడా ఈ చిచ్చు పచ్చని ఆశల చెట్టును కాల్చేసింది.

* * *

గవర్నమెంట్ ఎక్స్‌గ్రేషియా 5 లక్షలు!!

ఎల్.ఐ.సీ..ఓ లక్ష రూపాయలు!!

రెండు చెక్కులూ ఒకేరోజున అందేటప్పటికి రాజయ్య గుండెల్లో గాయం మళ్లీ మరింత తీవ్రంగా రేగింది- "నేను కోరింది నీ డబ్బు కాదురా..నిన్ను.." అంటూ కొడుకు ఫోటో ముందు వెలుగుతున్న దీపంలో ఆ రెండు చెక్కులూ కాల్చేయబోయాడు-గుండె దిటవు చేసుకుని ఓపిక తెచ్చుకుని లేచిన సుందరమ్మ భర్త చెయ్యిని వెనక్కి లాగేసింది.

విషాదయోగంలో ఉన్న అతనికి కర్మయోగాన్ని చెప్తున్న కృష్ణుడిలా కర్తవ్య బోధ చేసింది. నిజానికి ఆమెకి అంత తెలివీ లేదు. శక్తీ లేదు. ఆమెలోంచి కొడుకు శ్రీకృష్ణ ఈ కర్తవ్యాన్ని భోధిస్తున్నాడేమో అనుకుంటూ నిశ్చేష్టుడై వింటున్నాడు రాజయ్య-

"చూదయ్యా చెట్టంత బిడ్డ పోయాడని నువ్ ఏడవటం తప్పుకాదు. ఈ ఆవేశంలో నువ్ అనవసరమైన పని చేస్తున్నావ్..తప్పు!!

దేవుడు మన కొడుకుని తీసేసుకుని మనకింత డబ్బిచ్చాడు. ఎందుకు- ఇంకో పది మంది బిడ్డల్ని ఆదరించమని!! నిరుద్యోగంతో విసిగిపోయి వివేకంలేని మూకలో జేరి ఇలాంటి కల్లోలాలు సృష్టిస్తున్న కుర్రాళ్లని ఈ సొమ్ముతో ఆదుకుందామయ్యా" అని నచ్చ చెప్పింది భార్య.

రాజయ్యకి ఆ ఆలోచన నచ్చింది.

కొన్ని రిక్షాలూ, ఆటోబళ్లూ, కుట్టుమిషన్లూ ఇంకా అనేక స్వయం ఉపాధికి పనికొచ్చే సరంజామా అన్నీ ఇంటి ముందుకొచ్చాయి.

ఎందరో నిరుద్యోగులకి వాటిని అందించి, తాము సంపాదించి మళ్లీ ఆ డబ్బు తిరిగి ఇవ్వాలనీ, అలా ఇస్తే మరొకరికి ఆ సొమ్ము వినియోగిస్తామని చెప్పారు.

ఏరోజు కారోజు సంపాదనలో కొంత భాగాన్ని ప్రతీవాళ్లూ నిజాయితీగా చెల్లిస్తున్నారు. వాళ్లింటికి ఆ కృషికీ- శ్రీకృష్ణ సహనసదనం అని పేరు పెట్టారు.

కొన్నాళ్లిలా సజావుగా సాగుతోంది. యువకులంతా అమ్మగారూ అయ్యగారూ అంటూ వీళ్లిద్దర్నీ తల్లిదండ్రుల్లా గౌరవిస్తున్నారు. ప్రతీరోజూ లెక్కలు చూసుకోవటం రాసుకోవటం ఎవరికేం కావాలో చూడటంతో రాజయ్య సుందరమ్మలు బిజీగా వుంటున్నారు.

రావుడు వీళ్ల దగ్గరే రిక్షా తీసుకుని నడిపించేవాడు. ఎంతో గౌరవంగా మెలిగేవాడు. కానీ ఓ రోజు బేరంలో ఉండగా తన పాతదోస్తు వీరేశం కలిశాడు. ఇద్దరూ కల్సి ఉన్నప్పుడు చాలా అల్లర్లు అరాచకాలూ చేసేవారు. ఇప్పుడు రాముడు ఎంతో తృప్తిగా హాయిగా వుంటున్నానని చెప్పటంతో వీరేశం 'మందు పోయించమని అడిగాడు. 'మానేశానన్నాడు' రావుడు. 'నువ్ తాగద్దు నాకు తాగిపించు' అని బలవంత పెట్టాడు.

ఇద్దరూ కల్లు పాక నుంచి బైటకొచ్చేసరికి రావుడు బుర్రలో విషం ఎక్కింది.

'తమ కష్టాన్ని రాజయ్య దోచుకు తింటున్నాడని ఇదేం సంఘ సేవ కాదనీ..' వీరేశం ఎక్కించిన దుర్బుద్ధి నషాళానికి అంటింది.

ఎన్నడూ తలెత్తి సూటిగా చూడలేని రాజయ్యతో అనహ్యంగా ప్రవర్తించాడు. అసభ్యంగా నిందించాడు. అనూహ్యంగా రాజయ్యని తోసేశాడు.

తలకి గాయం అయింది. ధారలుగా రక్తం స్రవించింది.

మిగిలిన యువకులందరూ రావుణ్ని కొట్టబోతే రాజయ్య వద్దని వారించాడు.

రావుడికి మెల్లిగా స్పృహ వస్తోంది.

రాజయ్యకి మెల్లిగా స్పృహ పోతోంది.

రావుణ్ని దగ్గరికి పిలిచి ఇంకమీద ఈ సహన సదనం నువ్వే నిర్వహించాలి అని చెప్పి ఈ విషయం ఎక్కడా బైటపెట్టద్దని ఒట్టేయించుకుని రాజయ్య చనిపోయాడు. సుందరమ్మ ఆ దుఃఖాన్ని తట్టుకోలేక భర్తకన్నా ముందే చనిపోయింది.

రావుడు వాళ్లిద్దరికీ అంత్యక్రియలు చేశాడు.

పశ్చాత్తాపంతో పరమాత్ముడైపోయాడు. ఊరందరికీ పరమాప్తుడు అయాడు. పది పదిహేను ఏళ్లుగా ఈ సహనసదనాన్ని సమర్ధవంతంగా నడిపిస్తున్నాడు.

* * *

కథంతా విన్నాక రావుణ్ని మళ్లీ కలవాలనిపించింది నాకు వద్దనీ అనిపించింది. *